సాక్షి
సిద్దిపేట
సోమవారం • 30 • జనవరి • 2023



వేతన భారం పంచాయతీలదే..
చేతిపంపుల మెకానిక్‌లకు వేతనాలు ఇవ్వలేమని సర్పంచ్‌లు మొండికేయడంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. 8లో..

వంటిమామిడి వద్ద కారు బోల్తా
వంటిమామిడి వద్ద కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈఘటనలో ఒకరు మృతి చెందగా.. నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. 8లో..





ఆదివారం ఆస్పత్రికి సెలవు!
అక్కన్నపేట మండల కేంద్రంతో పాటు, రామవరం పీహెచ్‌సీ సిబ్బంది ఆదివారం విధులకు హాజరు కాకుండా సెలవు పెడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. 9లో..

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

గజ్వేల్‌రూరల్: తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ ప్రభుత్వాస్పత్రుల్లో నియామకానికి కాంట్రాక్టు పద్ధతిలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ సాయికిరణ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేసేందుకు అర్హులైన జనరల్ ఫిజిషియన్ (1), గైనకాలజీ (1), జీడీఎంఓ (3) వైద్య పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేసేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు చెప్పారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తుతో సర్టిఫికెట్లను జతచేసి గజ్వేల్‌లోని ప్రభుత్వాసుపత్రి ప్రధాన కార్యాలయంలో ఫిబ్రవరి 4వ తేదీలోగా సమర్పించాలని సూచించారు.

'విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి'

చిన్నకోడూరు(సిద్దిపేట): విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఎస్‌ఎస్‌యూఐ జిల్లా కన్వీనర్ అజ్జు యాదవ్ అన్నారు. ఆదివారం ఆయన చిన్నకోడూరులో విలేకరులతో మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టళ్లలో జరుగుతున్న ఫుడ్ పాయిజన్‌పై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయండి



మాట్లాడుతున్న ప్రశాంత్

చేర్యాల(సిద్దిపేట): పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఈనెల 30, 31వ తేదీల్లో జిల్లావ్యాప్తంగా చేపట్టనున్న ఆందోళన కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పట్టణ కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశాల్లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలన్నారు. హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించి, మెస్, కాస్మొటిక్ చార్జీలు పెంచాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాని కోరారు. సమావేశంలో చేర్యాల డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆముదాల రంజిత్‌రెడ్డి, సుద్దాల భాస్కర్, నాయకులు సంజీవ్, అరుణ్, మధు, మహేశ్, హర్షవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

అన్ని మతాలకు సమ ప్రాధాన్యం



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న రహీమొద్దీన్

దుబ్బాక: రాష్ట్ర ప్రభుత్వం అన్ని మతాలకు సమాన ప్రాధాన్యం ఇస్తుందని, బీఆర్‌ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని జిల్లా కోఆప్షన్ సభ్యుడు రహీమొద్దీన్ అన్నారు. మండల కేంద్రంలో జరుగుతున్న షాదీఖానా నిర్మాణ పనులను మండల పార్టీ అధ్యక్షుడు రణం శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి సహకారంతో మండల కేంద్రంలో షాదీఖానా నిర్మిస్తున్నామని తెలిపారు.

సీఎస్‌ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు



ప్రార్థనలో భక్తులు

మెదక్‌జోన్: పట్టణంలోని ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన సీఎస్‌ఐ చర్చిలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చ్ ప్రెసిబెటరీ ఇన్‌చార్జ్ శాంతయ్య దైవ సందేశమిచ్చారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గురువులు భక్తులను ఆశీర్వదించారు. భారీగా తరలివచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

మల్లన్నకు 'లష్కర్' బోనం

కొమురవెల్లిలో భక్తుల సందడి ● కిక్కిరిసిన క్యూలైన్లు ● జనసంద్రమైన ఆలయ పరిసరాలు



స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

కొమురవెల్లి(సిద్దిపేట): కోరమీసాల స్వామి కొమురవెల్లి మల్లన్న క్షేత్రానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. లష్కర్‌వారం సందర్భంగా మల్లన్న నామస్మరణతో కొమురవెల్లి మారుమోగింది. హైదరాబాద్, సికింద్రాబాద్, రంగారెడ్డితో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయానికి సంబంధించిన గదులు చాలకపోవడంతో ప్రైవేట్ గదులను ఆశ్రయించారు. ఆలయ ప్రాంగణంలోని గంగరేణి చెట్టు, రాజగోపురం, రాతిగీరలు, కోడెల స్తంభం, తోట బావి, ఎల్లమ్మ కమాన్, బస్టాండ్ ప్రాంగణంతో పాటు ఆలయ పరిసరాలు భక్తుల విడిదితో పూర్తిగా నిండిపోయాయి. అడిషనల్ డీసీపీ మహేందర్ ఆధ్వర్యంలో 250 మంది ఎన్‌సీసీ విద్యార్థులు, 180 మంది పోలీసులతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.



రాజగోపురం ఎదుట భక్తుల రద్దీ

బోనం సమర్పించి.. మొక్కులు చెల్లించి

మల్లన్నకు మొక్కులు చెల్లించడానికి వచ్చిన భక్తులు మొదటగా తలనీలాలు సమర్పించారు. ఒక్కపొద్దుతో మట్టికుండలో పసుపు బియ్యంతో బోనం వండి స్వామివారికి నైవేద్యం సమర్పించారు. శివసత్తులు, డప్పుచప్పుళ్లతో మొక్కులు చెల్లించారు. అనంతరం గంగరేణి చెట్టు వద్ద బోనాలు సమర్పించి పట్నాలు వేశారు. క్యూలైన్‌లో ఉండి మల్లన్నను దర్శించుకున్నారు.

రేణుక ఎల్లమ్మకు పూజలు

కొమురవెల్లికి వచ్చిన భక్తులు మొదట మల్లన్నకు బోనాలు, పట్నాలు సమర్పించారు. అనంతరం రేణుక ఎల్లమ్మతో పాటు నల్లపోచమ్మను దర్శించుకోవడానికి సుమారు మూడు గంటల సమయం పట్టింది. కొమురవెల్లిలో మల్లన్నకు మొక్కులు చెల్లించిన తర్వాత గుట్టపై వెలిసిన రేణుక ఎల్లమ్మకు బోనం సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది.



బోనంతో ఆలయానికి వస్తున్న యువతి



ఈరగోలతో భక్తుడి విన్యాసం

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి



రాజగోపాల్‌పేట సబ్‌సెంటర్‌ను పరిశీలిస్తున్న బాలరాజు, తదితరులు

నంగునూరు(సిద్దిపేట): గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని మంత్రి ఓఎస్‌డీ బాలరాజు, మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. రాజగోపాల్‌పేటలో జరుగుతున్న నిర్మాణ పనులను ఆదివారం అధికారులతో కలిసి పరిశీలించారు. వైకుంఠధామం, ఏఎన్‌ఎం, సబ్‌సెంటర్, పల్లె ప్రకృతి వనం, తాగునీటి ట్యాంక్, సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించి సూచనలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మంత్రి హరీశ్‌రావు త్వరలోనే భవనాలను ప్రారంభిస్తారని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను సూచించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు చందు, కమాల్‌షరీఫ్, రాజుగౌడ్, మహేశ్, మల్లేశం, బాలరాజు, మధు, బాలకిషన్, తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన వద్దు.. అండగా ఉంటాం



బెజ్జంకి: నర్సింహులపల్లెలో వరిని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్, అధికారులు

- మొగి పురుగు నష్టంపై ప్రభుత్వానికి నివేదిక ఇస్తాం
- కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్

సిద్దిపేటరూరల్/ బెజ్జంకి(సిద్దిపేట): మొగి పురుగు గురించి రైతులు ఆందోళన చెందొద్దని, వ్యవసాయ అధికారులతో సర్వే చేయించి ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్ అన్నారు. ఆదివారం నారాయణరావుపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో మంత్రి హరీశ్‌రావు ఆదేశాల మేరకు రైతులతో సమావేశం నిర్వహించారు. మొగి పురుగు క్రిమిసంహారక మందుల వాడకం వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను అధికారులు కలెక్టర్‌కు విన్నవించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులు శాస్త్రవేత్తల వ్యవసాయశాఖ అధికారుల సమన్వయంతో పంటల సాగు చేపట్టడం ద్వారా మంచి దిగుబడి వచ్చే ఆస్కారం ఉంటుందన్నారు. శాస్త్రవేత్తలు, అధికారులు రైతుల పంటలను పరిశీలించి ఎప్పటికప్పుడు తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ మాట్లాడుతూ.. రైతులు అధిక మోతాదులో క్రిమిసంహారక మందుల వాడకం, తక్కువ సమయంలోనే పంటల సాగు చేయడం వల్ల తెగుళ్లు ఆశించే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త విజయ్ పంటల సాగుకు సంబంధించిన వివరాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏడీఏ పద్మ, మండల వ్యవసాయ అధికారి రమణి, ఎంపీపీ బాలమల్లు, వైస్ ఎంపీపీ సంతోశ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు బెజ్జంకి శివారులోని వరి పంటలను కలెక్టర్ వ్యవసాయ అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ లింగాల నిర్మల, తహసీల్దార్ విజయ ప్రకాశ్‌రావు, ఏఎంసీ చైర్మన్ కచ్చు రాజయ్య, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

జనక్షేత్రంగా ఏడుపాయల

దుర్గమ్మ సేవలో హైకోర్టు పీపీ



దుర్గమ్మను దర్శించుకుంటున్న భక్తులు

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల ఆదివారం జన క్షేత్రంగా మారింది. హైకోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రతాప్ రెడ్డి దంపతులు దుర్గమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. పాలక వర్గ చైర్మన్ బాలాగౌడ్, ఈఓ సారా శ్రీనివాస్ వారికి ఆలయ మర్యాదల ప్రకారం స్వాగతం పలికి, శాలువాతో సత్కరించారు. పూజారులు ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు మంజీరా పాయల్లో స్నానాలు చేసి, దుర్గమ్మను దర్శించుకొని, ఒడి బియ్యం, బోనాలు సమర్పించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ధర్మకర్తలు, పోలీస్ సిబ్బంది చర్యలు తీసుకున్నారు.

సంపద పెంచి పేదలకు పంచుతున్నాం



కల్లు తాగుతున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి

జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో సంపద పెంచి పేదలకు పంచుతున్నామని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. ఆదివారం దూళ్మిట్ట మండలంలోని తోర్నాలలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. దేశంలో ఏరాష్ట్రంలో లేని విధంగా సీఎం కేసీఆర్ రాష్ట్రంలో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని కొనియాడారు. దీనిని చూసి ఓర్వలేకే కాంగ్రెస్, బీజేపీ నాయకులు అసత్యాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. నూతనంగా ఏర్పాటైన దూళ్మిట్ట మండల అభివృద్ధికి సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు రెండు కోట్ల రూపాయల నిధులు మంజూరు చేశారని వివరించారు. సంక్షేమ పథకాలను అడ్డుకునే బీజేపీ నాయకులు గ్రామాల్లోకి వస్తే తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ తాళ్లపల్లి రాజమ్మ, ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి, టీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మంద యాదగిరి, ఉపాధ్యక్షుడు ఇమ్మడి సంజీవరెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు వరలక్ష్మి సాగర్, యూత్ అధ్యక్షుడు బడుగు సాయిలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలి

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ



కోహెడలో పర్యటిస్తున్న చాడ వెంకట్‌రెడ్డి

కోహెడరూరల్(హుస్నాబాద్): రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం పల్లె పల్లెకు సీపీఐ.. ప్రజల వద్దకు సీపీఐ కార్యక్రమంలో భాగంగా కోహెడ మండలంలోని బస్వాపూర్, పోరెడ్డిపల్లి, అరెపల్లి, నాగసముద్రాల, శ్రీరాములపల్లితో పాటు పలు గ్రామాల్లో పర్యటించారు. ఈసందర్భంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ధరణితో రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. ఎన్ని ఫిర్యాదులు వచ్చినా ప్రభుత్వం స్పందించకపోవడం సరికాదన్నారు. అలాగే డబుల్ బెడ్రూం ఇళ్లు, రేషన్ కార్డులు, ఆసరా పింఛన్లు మంజూరు చేయాలన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తుందని.. పద్ధతి మార్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మంద పవన్, కార్యవర్గ సభ్యులు వేల్పుల బాలమల్లు, కనుకుంట్ల శంకర్, మండల కార్యదర్శి ముంజ గోపి, సహాయ కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు శంకర్, జనార్దన్, సంపత్, శేఖర్, మధు, తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాక బీజేపీలో అసమ్మతి సెగలు!

నాయకులు, కార్యకర్తల రహస్య సమావేశం

మిరుదొడ్డి(దుబ్బాక): దుబ్బాక బీజేపీలో మరోసారి అసమ్మతి సెగ రాజుకుంటున్నట్లు తెలిసింది. ఇటీవల నియోజకవర్గంలోని చేగుంట మండలంలో దుబ్బాక ఎమ్మెల్యే తీరును నిరసిస్తూ బాహాటంగా సీనియర్ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేసిన తీరు మరువక ముందే నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మిరుదొడ్డి మండలాన్ని వేదికగా చేసుకుని ఆదివారం రహస్య సమావేశం నిర్వహించినట్లు సమాచారం. సమావేశంలో నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే రఘునందన్‌రావు తీరును ఎండగట్టినట్లు తెలిసింది. కాగా ఈ సమావేశానికి బీజేపీ నాయకులు పెద్ద ఎత్తున హాజరైనట్లు ప్రచారం జరగడం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. ఇటీవల చేగుంట మండలంలో సీనియర్ బీజేపీ నాయకులు అసమ్మతి సెగతో తెరమీదికి రావడం, మిరుదొడ్డిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు రహస్య సమావేశం నిర్వహించడం హాట్ టాఫిక్‌గా మారింది.

ఇదే విషయమై బీజేపీ జిల్లా నాయకుడు కాన్గంటి శ్రీనివాస్ ఆదివారం విలేకరులతో మాట్లాడారు. దుబ్బాక బీజేపీలో అసమ్మతి సెగలు నెలకొంటున్నాయని వస్తున్న ప్రచారంలో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు. మిరుదొడ్డిలోని నా వ్యవసాయ బావి వద్ద గ్రామ దేవత పండగ చేసుకున్నట్లు వివరించారు. పండగకు నియోజకవర్గం నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలతో పాటు బంధుమిత్రులను విందుకు ఆహ్వానించినట్లు తెలిపారు. గిట్టని వారు అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

ముందడుగు ఏదీ..?

చడీ చప్పుడులేని 'ఎల్‌ఆర్‌ఎస్'

- జిల్లాలో 55 వేలకుపైగా దరఖాస్తుల పెండింగ్
- ప్రభుత్వ చర్యల కోసం ఎదురుచూపు



గజ్వేల్- ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో అనుమతిలేని వెంచర్

గజ్వేల్: మున్సిపాలిటీల్లో ఎల్‌ఆర్‌ఎస్ (లే-అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం) దరఖాస్తుల పరిష్కార వ్యవహారం చడీచప్పుడు లేకుండా తయారైంది. గతేడాది మార్గదర్శకాలు వెలువడుతాయని మున్సిపల్ యంత్రాంగం హడావిడి చేసింది. ఇప్పటికి రెండేళ్లు గడుస్తున్నా కొలిక్కిరాలేదు. జిల్లాలోని మున్సిపాలిటీల్లో 55 వేలకు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

- జిల్లాలో సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్, దుబ్బాక, చేర్యాల మున్సిపాలిటీలు ఉన్నాయి. ఆయా మున్సిపాలిటీల్లో ఏర్పాటు చేసిన వెంచర్లలో నిబంధనలు పాటించలేదు.
- వెంచర్లలో పార్క్‌కు పదిశాతం భూమి వదిలిపెట్టడం గానీ, రోడ్లకు 30 ఫీట్లు వదిలిపెట్టలేదు.
- ఎలాగూ ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ తీసుకొస్తుందనే నమ్మకంతో పేద, మధ్య తరగతికి చెందిన ప్రజలు పెద్ద ఎత్తున ప్లాట్లు కొనుగోలు చేశారు.
- ఈ క్రమంలోనే ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం 2020 సెప్టెంబర్, అక్టోబర్‌లో ఎల్‌ఆర్‌ఎస్‌కు జిల్లాలోని ఆయా మున్సిపాలిటీల నుంచి దరఖాస్తులు వచ్చాయి.
- ఇంతకాలం అనధికారిక లే-అవుట్లలో ఉన్న సామాన్యులంతా క్రమబద్ధీకరణ కోసం పెద్ద ఎత్తున దరఖాస్తు చేసుకున్నారు.
- సిద్దిపేట మున్సిపాలిటీలో 32 వేలు, గజ్వేల్-ప్రజ్ఞాపూర్‌లో 10 వేలు, దుబ్బాకలో 2,900, హుస్నాబాద్‌లో 3,500, చేర్యాలలో మరో 6,750 దరఖాస్తులు వచ్చాయి.
- మొత్తంగా 55 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. కానీ రెండేళ్లు గడుస్తున్నా పరిష్కార ప్రక్రియ పెండింగ్‌లో పడుతూ వచ్చింది.

మున్సిపల్ యంత్రాంగం హడావిడి!

- గతేడాది మార్గదర్శకాలు వచ్చాయంటూ మున్సిపల్ యంత్రాంగం హడావిడి చేసింది. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల గ్రూపింగ్, క్లస్టరింగ్ చేసే పనిని సమీక్షించుకుంటున్నామని చెప్పుకొచ్చారు.
- క్షేత్రస్థాయిలో ప్లాట్లను పరిశీలించి నిబంధనల ప్రకారం ఉంటే ఎల్‌ఆర్‌ఎస్ డిస్పోజల్‌కు చెల్లించాల్సిన మొత్తం వివరాలు తెలియాల్సి ఉండగా.. ఈ ప్రకియను సైతం ప్రారంభిస్తామని చెప్పారు.
- సుమారు 100 గజాలున్న ప్లాటును రెగ్యులరైజ్ చేసుకోవాలన్నా, ప్లాటు రిజిస్ట్రేషన్ విలువ గజానికి రూ. 1,000 ఉంటే ఓపెన్ స్పేస్ చార్జీ రూ. 16744, క్రమబద్ధీకరణ చార్జీ చెల్లించాలి.
- అలాగే రూ. 5000, దరఖాస్తు చేసే సందర్భంలో చెల్లించే మరో రూ. 1000 కలుపుకొని మొత్తంగా రూ. 22,744 చెల్లించాల్సి ఉంటుంది.
- ప్లాటు విస్తీర్ణం, మార్కెట్ విలువ పెరిగేకొద్ది సహజంగానే క్రమబద్ధీకరణకు చెల్లించాల్సిన మొత్తం కూడా పెరగనుంది.
- ఈ రేట్లు మారతాయా..? కొత్త రేట్ల ప్రకారం ఎల్‌ఆర్‌ఎస్ పూర్తి చేస్తారా? అనే విషయం ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు వెలువడితేనే తెలుస్తుంది.
- సిద్దిపేట లాంటి ప్రధాన మున్సిపాలిటీలో మాస్టర్ ప్లాన్ పేరిట అదనపు చార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. కానీ ఈ హడావిడి కొద్ది రోజులకే పరిమితమైంది.
- వివిధ సాంకేతిక కారణాలతో ఈ ప్రక్రియ అర్ధాంతరంగా నిలిచిపోయింది. ఫలితంగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి ఆన్‌లైన్‌లో లాగిన్ ఇవ్వలేదు. దీంతో వ్యవహారం మొదటికొచ్చింది.

ప్రభుత్వ మార్గదర్శకాలు వస్తేనే

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి మార్గదర్శకాలు రావాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి అనుమతి వస్తేనే దరఖాస్తులను క్లస్టరింగ్ చేసి, మిగిలా ప్రక్రియ పూర్తి చేస్తాం.
– విద్యాధర్, గజ్వేల్- ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్

వేతన భారం పంచాయతీలదే..

- చేతిపంపు మెకానిక్‌లకు జీతాలు ఇవ్వాలని పంచాయతీలకు ఆదేశం
- సర్పంచ్‌లపై ఒత్తిడి
- మేజర్ పంచాయతీలకు కేటాయించాలంటున్న సర్పంచ్‌లు

హుస్నాబాద్‌రూరల్: గ్రామీణ ప్రజలకు దహార్తీ తీర్చే చేతిపంపుల మరమ్మతులకు జిల్లాలో ఔట్ సోర్సింగ్ పద్ధతిన పంపు మెకానిక్‌లను ప్రభుత్వం నియమించింది. జిల్లాల పునర్విభజన జరగడం, పల్లెలకు మిషన్ భగీరథ తాగునీరు సరఫరా కావడంతో వీరితో పనిలేదని అధికారులు పక్కన పెట్టారు. తమను పనిలోకి తీసుకోవాలని కోరుతూ కోర్టును ఆశ్రయించడంతో మళ్లీ విధుల్లోకి తీసుకున్నారు. హుస్నాబాద్ డివిజన్ పరిధిలోని కోహెడ, హుస్నాబాద్‌లో ఇద్దరితోపాటు జిల్లాలో పంపు మెకానిక్‌లు పని చేస్తున్నారు. వీరికి నెలకు రూ.13 వేల చొప్పున వేతనాలను మండల పరిషత్ నుంచి ఇచ్చేవారు. ఇప్పుడు మండల పరిషత్‌లకు నిధులు లేకపోవడంతో, అధికారులు తమ దగ్గర డబ్బులు లేవని పంపు మెకానిక్‌ల అవసరం గ్రామ పంచాయతీలకే ఉందని, వారికి నెలకు ఒక పంచాయతీ నుంచి వేతనం ఇవ్వాలని సర్పంచ్‌లను ఒప్పించి వేతనాలు ఇప్పించారు. ఎనిమిది నెలలుగా గ్రామ పంచాయతీలకు నిధులు రాకపోవడంతో పంచాయతీ సిబ్బందికి కూడా వేతనాలు ఇచ్చేందుకు సర్పంచ్‌లు ఇబ్బందులు పడ్డారు. పక్షం కిందట నిధులు రావడంతో అధికారులు విద్యుత్ బిల్లుల చెల్లింపులు, కంప్యూటర్ ఆపరేటర్ల వేతనాలు, పంపు మెకానిక్ వేతనాలు జీపీల నుంచి చెల్లించాలని కార్యదర్శులను అధికారులు ఆదేశించారు. పంపు మెకానిక్‌లు తమకు అవసరంలేదని, తాము వేతనాలు ఇవ్వలేమని సర్పంచ్‌లు మొండికేయడంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

పనులు లేనప్పుడు వేతనాలు ఎందుకు?

- గ్రామాల్లో తాగునీరు సరఫరా పైపులైన్ల మరమ్మతులకే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అనుమతులు ఇవ్వడం లేదు.
- గ్రామాలకు మిషన్ భగీరథ తాగునీరు వస్తుందని, పైపులైన్ మరమ్మతుల అవసరం లేదని సంబంధిత అధికారులు సర్పంచ్‌లకు చెబుతున్నారు.
- నల్లా పన్నులు వసూలు చేయొద్దని అధికారులు ఆదేశించడంతో పంచాయతీలకు ఆదాయ వనరులు తగ్గిపోయాయి.
- పంచాయతీలకు వచ్చిన నిధులు ట్రాక్టర్, విద్యుత్ బిల్లులకే సరిపోవడం లేదని సర్పంచ్‌లు వాపోతున్నారు.
- చేతి పంపుల అవసరం లేనప్పుడు మెకానిక్‌ల అవసరం ఏముందని, వారికి వేతనాలు పంచాయతీల నుంచి ఎందుకు ఇవ్వాలని సర్పంచ్‌లు తిరస్కరిస్తున్నారు.
- మండల పరిషత్ ఉద్యోగి అయినప్పుడు మండల పరిషత్ నుంచి వేతనాలు ఇవ్వాలి తప్ప, ప్రతీదానికి పంచాయతీల నుంచి డబ్బులు అడుగటం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.
- కంప్యూటర్ ఆపరేటర్ల వేతనాలు కూడా పంచాయతీల నుంచి ఇప్పించి మండల పరిషత్ పనులను వారితో చేయిస్తున్నారని ఆరోపిస్తున్నారు.
- అధికారులు ప్రతీఖర్చును సర్పంచ్‌ల నుంచి వసూలు చేస్తున్నారని, కొందరు సర్పంచ్‌లు ఇబ్బందులు పడుతున్నా బయటకు చెప్పుకోలేకపోతున్నారని మరికొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- చేతి పంపులు పనిచేయనప్పుడు పంపు మెకానిక్‌లను మేజర్ గ్రామ పంచాయతీలకు అప్పగిస్తే అక్కడే పనులు చేయించుకొని వేతనాలు ఇస్తే బాగుంటుందని సర్పంచ్‌లు అభిప్రాయపడుతున్నారు.
- ఉద్యోగ భద్రత కల్పించి రెగ్యులర్ వేతనం ఇచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని మెకానిక్‌లు కోరుతున్నారు.



కిషన్ నగర్‌లో వినియోగంలో లేని చేతి పంపు

మా దగ్గర పని లేదు పైసలు ఇవ్వం



మా గ్రామంలో పనులు చేసే సిబ్బందికి వేతనాలు ఇవ్వడం, ట్రాక్టర్ కిస్తీలు, విద్యుత్ బిల్లులు చెల్లించడానికే మా నిధులు అయిపోతున్నాయి. మా దగ్గర పని చేయనప్పుడు మేమెందుకు పంపు మెకానిక్‌లకు వేతనాలు ఇవ్వాలి. మా పంచాయతీ సిబ్బంది పనులు చేస్తున్నారు, వారికి వేతనాలను ప్రభుత్వం పెంచడం న్యాయబద్ధంగా ఉంది. మండల పరిషత్‌లో డబ్బులు లేనప్పుడు వాళ్లను మరోశాఖకు బదిలీ చేసి పని చేయించుకోవాలి.

– తోడేటి రమేశ్, సర్పంచ్

మేజర్ జీపీలకు కేటాయిస్తే బాగుంటది



మండల పరిషత్‌లో డబ్బులు లేనప్పుడు పంచాయతీల నుంచి ఇవ్వాలని కోర్టు ఆదేశాలు ఉన్నాయని చెప్పడంతో ఏడాది కిందట వారికి జీపీల నుంచి వేతనాలు ఇప్పించారు. ఇప్పుడు మిషన్ భగీరథ తాగునీరు రావడంతో చేతి పంపుల ఉపయోగం లేదు, వాటిని ఎక్కడా మరమ్మతులు చేయడం లేదు. పంపు మెకానిక్‌లను మేజర్ పంచాయతీలకు కేటాయించి అక్కడే వేతనాలు ఇవ్వాలని అంటే బాగుటుంది. మైనర్ పంచాయతీలను అడగాలంటే వారే ట్రాక్టర్ల మెయింటినెన్స్‌కు ఇబ్బందిపడుతున్నారు.

– రాజీవ్‌కుమార్, డీఎల్పీఓ

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

హుస్నాబాద్: తెలంగాణ మోడల్ స్కూల్ 2023–24 సంవత్సరానికిగాను 6వ తరగతి ప్రవేశం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అన్నపూర్ణ ఆదివారం తెలిపారు. మోడల్ స్కూల్‌లో క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్య అందిస్తున్నామని, గ్రామీణ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పరీక్ష ఫీజు జనరల్ కేటగిరి విద్యార్థులకు రూ.200, ఈడబ్ల్యూఎస్, దివ్యాంగులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.125 ఫీజు చెల్లించాలన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ ఫిబ్రవరి 15వ తేదీగా పేర్కొన్నారు. హాల్‌టికెట్ డౌన్‌లోడింగ్ ఏప్రిల్ 8 నుంచి చేసుకోవచ్చన్నారు. అడ్మిషన్ పరీక్ష తేదీ ఏప్రిల్ 16, విద్యార్థుల ఎంపిక జాబితా విడుదల మే 24న ప్రకటిస్తామన్నారు. ఇక సర్టిఫికెట్ల వెరిఫికేషన్, అడ్మిషన్లు మే 25వ తేదీ నుంచి 31 వరకు, తరగతులు జూన్ 1వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు. పరిమిత సీట్లు ఉండే మోడల్ స్కూల్‌లో ఎంపిక పరీక్ష ద్వారా 6వ తరగతిలో ప్రవేశాలు కల్పించడం జరుగుతుందన్నారు.

విజేతలకు బహుమతి ప్రదానం

సంగారెడ్డి మున్సిపాలిటీ: సంగారెడ్డిలో ఆదివారం విజేతలకు బహుమతులు అందజేశారు. ×స్పోర్ట్స్ అండ్ ఫ్యాషన్స్‌×ౕ ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. టోర్నమెంట్‌లో ఆరు జట్లు పాల్గొన్నాయి. పట్టణానికి చెందిన ఆదిల్ టీం విజేతగా నిలిచింది. దీంతో విజేతలకు స్పోర్ట్స్ అండ్ ఫ్యాషన్స్ సంస్థ యజమాని కరణం రవికుమార్ నగదు బహుమతి, జెర్సీలు, మెమొంటో అందజేశారు.

భారత్‌జోడో యాత్రలో..



మాణిక్‌రావ్‌ఠాక్రేతో జహీరాబాద్ నేతలు

జహీరాబాద్: ఏఐసీసీ నాయకుడు రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రలో పాల్గొనేందుకు జహీరాబాద్ కాంగ్రెస్ నేతలు జమ్మూకశ్మీర్‌కు వెళ్లారు. ఆదివారం కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌ఠాక్రే, భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జహీరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ మదన్‌మోహన్‌రావు, ఎంపీపీ అధ్యక్షుడు ఎస్.గిరిధర్‌రెడ్డి పంథాచౌక్ వద్ద పాల్గొన్నారు.

కౌన్సిలర్‌పై కేసు నమోదు

తూప్రాన్: బీఆర్‌ఎస్ నాయకుడిపై దాడితో పాటు రాష్ట్ర సీఎం, మంత్రి, ఎంపీని అసభ్యంగా దూషించిన కౌన్సిలర్‌పై కేసు నమోదు చేసినట్లు ఆదివారం ఎస్‌ఐ సురేశ్‌కుమార్ తెలిపారు. ఈనెల 25వ తేదీ రాత్రి బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన యువకులు గణతంత్ర వేడుకల సందర్భంగా జెండా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో 15వ వార్డు కౌన్సిలర్ శ్రీశైలంగౌడ్ వారిని దూషిస్తూ చేయిచేసుకోవడంతో యువకులు కౌన్సిలర్‌ను నిలదీయశారు. రెచ్చిపోయిన కౌన్సిలర్ మీ ఇష్టం వచ్చిన వారికి చెప్పుకోవాలంటూ సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు, ఎంపీ ప్రభాకర్‌రెడ్డిని అసభ్యకరంగా దూషించాడు. దీంతో బీఆర్‌ఎస్ నాయకుడు మహ్మద్ యాసీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కౌన్సిలర్ శ్రీశైలంగౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రెండు ఇళ్లలో చోరీ

సిద్దిపేటకమాన్: తాళం వేసి ఉన్న ఇళ్లలో దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన సిద్దిపేటలో చోటు చేసుకుంది. ఆదివారం సిద్దిపేట వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన తుమ్మల లత, తరుణ్‌కుమార్ ఈనెల 28వ తేదీన తమ ఇళ్లకు తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి ఆదివారం వచ్చి చూసే సరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉండటం గమనించారు. లత ఇంట్లోని బీరువాలో దాచిన 2 తులాల బంగారు నగలు, తరుణ్‌కుమార్ ఇంట్లో రూ.50 వేల విలువగల సెల్‌ఫోన్, కొంత నగదు ఎత్తుకెళ్లినట్లు గ్రహించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



ట్రాన్స్‌ఫార్మర్‌కు సపోర్టుగా పెట్టిన కట్టెలు

దుబ్బాకరూరల్: మండలంలోని చీకోడ్‌కు వెళ్లే దారిలో పొలాలకు సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ గద్దెకు పగుళ్లు ఏర్పడి కూలిపోయే స్థితిలో ఉంది. గద్దె కూలిపోకుండా రైతులు కట్టెలను సపోర్టుగా పెట్టారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా కాంట్రాక్టర్లు నాణ్యతలేని గద్దెను నిర్మించడంతో పగులు ఏర్పడింది. విద్యుత్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరంలో సర్పంచ్ ప్రకాశ్‌చారి

జిన్నారం(పటాన్‌చెరు): గడ్డపోతారంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఆదివారం న్యూలాండ్ పరిశ్రమ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని సర్పంచ్ ప్రకాశ్‌చారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు ఆస్పత్రులకు చెందిన వైద్యులు రోగులకు పరీక్షలు నిర్వహించారన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు.

గుండెపోటుతో రైతు హఠాన్మరణం



సత్యనారాయణ (ఫైల్)

వర్గల్(గజ్వేల్): గుండెపోటుతో రైతు హఠాన్మరణం చెందగా కూతురు తలకొరివి పట్టిన విషాదకర సంఘటన ఆదివారం వర్గల్ మండలం మైలారంలో జరిగింది. మృతుడి కుటుంబీకులను ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి పరామర్శించి ఓదార్చారు. అంత్యక్రియలలో పాల్గొన్నారు. వివరాల్లోకి వెళితే రైతు కొలిచెలిమె సత్యనారాయణ(43)కు భార్య కనకమ్మ, ముగ్గురు కూతుళ్లు రాజేశ్వరి, సుచిత్ర, భార్గవి ఉన్నారు. సత్యనారాయణకు శనివారం అధిక రక్తపోటుతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే కుటుంబీకులు హైదరాబాద్‌కు తరలించి చికిత్స చేయించినప్పటికీ ఫలితం దక్కలేదు. కుమారులు లేకపోవడంతో చిన్న కూతురు భార్గవి తలకొరివి పట్టి అంత్యక్రియలు నిర్వహించింది. రైతు కుటుంబాన్ని ఆదుకుంటామని ఎమ్మెల్సీ, ఎఫ్‌డీసీ చైర్మన్ భరోసా ఇచ్చారు.

హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి



వార్డెన్‌తో మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు

హుస్నాబాద్: విద్యార్థులకు సరైన భోజనం అందించకుండా అనారోగ్యానికి గురిచేస్తున్న హాస్టల్ వార్డెన్ మల్లేశంపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సావుల ఆదిత్య డిమాండ్ చేశాడు. పట్టణంలోని ప్రభుత్వ బీసీ బాలుర హాస్టల్‌ను ఆదివారం ఏబీవీపీ నాయకులు సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆదిత్య మాట్లాడుతూ హాస్టల్‌లో నాణ్యత లేని ఆహారం పెట్టడం వల్ల విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారు. మరుగుదొడ్లు పరిశుభ్రంగాలేక రోగాల బారిన పడుతున్న వార్డెన్ పట్టించుకోవడం లేదని మండిపడ్డాడు. సమస్యలు పరిష్కరించాలని వార్డెన్‌కు తెలియజేస్తే విద్యార్థులను టార్గెట్ చేసి హాస్టల్ నుంచి తొలగిస్తామని బెదిరిస్తున్నాడని ఆరోపించాడు. సమస్యలు పరిష్కరించాలని అడిగిన ఏబీవీపీ నాయకులపైన కూడా కేసులు పెడతామనే విధంగా వ్యవహరిస్తున్న వార్డెన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాడు. కార్యక్రమంలో ఏబీవీపీ నగర ఉప కార్యదర్శి రాకేష్, చరణ్, రాజేష్, మణి, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ఊదా వర్ణ శోభితం



దుబ్బాక: దౌల్తాబాద్ మండలం తిరుమలాపూర్ గ్రామంలో ఆదివారం సూర్యాస్తమయం తర్వాత ఆకాశం ఊదా వర్ణంలో కనిపించి అందరిని అలరించింది. ఈ దృశ్యం వీక్షకులను కనువిందు చేసింది. ఈ చిత్రాన్ని సాక్షి క్లిక్‌మనిపించింది.

దేవాలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న జెడ్పీటీసీ మీనాక్షి సాయికుమార్

మునిపల్లి(అందోల్): సంగమేశ్వర దేవాలయ నిర్మాణానికి జెడ్పీటీసీ మీనాక్షి సాయికుమార్ రూ.25 వేలు విరాళం అందజేశారు. ఆదివారం మండలంలోని గొర్రెగట్టు గ్రామంలో సంగమేశ్వర దేవాలయ నిర్మాణానికి విరాళాలు సేకరించారు. ఖమ్మంపల్లి, పొల్కంపల్లిలో జెడ్పీటీసీ మీనాక్షి సాయికుమార్ ఫాంహౌస్‌లో పీఎస్‌ఆర్ పౌండేషన్ ద్వారా విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వీరన్న, చంద్రయ్య (టీచర్), రవి, నాగేష్, మోహన్ పాల్గొన్నారు.

ఘనంగా ఆదినారాయణ కల్యాణం



స్వామివారి కల్యాణంలో నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): కొడకంచిలో ఆదినారాయణ స్వామి ఆలయంలో శనివారం రాత్రి స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ ట్రస్ట్ చైర్మన్ రామాజీరావు ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు చేశారు. ఫిబ్రవరి 1 నుంచి నిర్వహించే స్వామివారి రథోత్సవం విజయవంతం చేయాలని కోరారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్ టౌన్: న్యాల్‌కల్‌లోని చాల్కి గ్రామం లబ్ధిదారులకు ఎమ్మెల్యే మాణిక్‌రావు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆదివారం అందచేశారు. బస్వరాజ్, దిలీప్‌లు అనారోగ్యంతో బాధపడుతున్నారు. మెరుగైన వైద్య సేవల నిమిత్తం ఆర్థిక సాయం కోసం ఎమ్మెల్యేను కలిశారు. బస్వరాజ్‌కు రూ.48 వేలు, దిలీప్‌కు రూ.24 వేలు సీఎం రిలీఫ్ ఫండ్‌ను ఎమ్మెల్యే మంజూరు చేయించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చంద్రోఖర్ తదితరులు పాల్గొన్నారు.

నగర సంకీర్తనకు స్పందన



శాంతినగర్‌లో నిర్వహించిన నగర సంకీర్తనలో భక్తులు

జహీరాబాద్ టౌన్: శాంతినగర్‌లో ఆదివారం నిర్వహించిన నగర సంకీర్తనకు విశేష స్పందన వచ్చింది. గత కొన్ని నెలల నుంచి జహీరాబాద్‌లో నగర సంకీర్తన నిర్వహిస్తున్నారు. పాల్గొనేందుకు భక్తులు తరలివచ్చారు. తెల్లవారు జాము నుంచి భక్తులు భజన చేస్తూ కీర్తనలు ఆలపిస్తూ పాదయాత్ర నిర్వహించారు.

రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే



దామోదర సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న నాయకులు

మాజీ డిప్యూటీ సీఎం దామోదర రాజనర్సింహ

వట్‌పల్లి(అందోల్): కేసీఆర్ ఎన్ని కుయుక్తులు పన్నినా రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని మాజీ డిప్యూటీ సీఎం దామోదర రాజనర్సింహా ధీమా వ్యక్తం చేశారు. మండల పరిధిలోని బిజిలీపూర్ గ్రామానికి చెందిన పలువురు పార్టీలో చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అమలుకు నోచుకోని అనేక వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరించారన్నారు. రాహుల్‌గాంధీ నాయకత్వంలో కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందన్నారు. కాంగ్రెస్ ద్వారానే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. ప్రజలు ధైర్యంగా ఉండాలని, హస్తం బడుగు బలహీన వర్గాల నేస్తమన్నారు.

రోడ్డుప్రమాదంలో ఆర్టీసీ కండక్టర్ మృతి



శ్రీనివాస్ (ఫైల్)

మెదక్ రూరల్: బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడిన ఆర్టీసీ కండక్టర్ మృతిచెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మెదక్ జిల్లా కొల్చారం మండలం అప్పాజిపల్లి గ్రామానికి చెందిన శివలింగారి శ్రీనివాస్(47) సంగారెడ్డి ఆర్టీసీ డిపో కండక్టర్. ఆదివారం మెదక్ నుంచి హవేళిఘణాపూర్ మండలం ముత్తాయికోటకు బైక్‌పై వెళ్తుండగా వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. దీంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య లావణ్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

వంటిమామిడి వద్ద కారు బోల్తా

ఎల్‌ఈడీ ఆపరేటర్ దుర్మరణం



మొహిజొద్దీన్ మృతదేహం

ములుగు(గజ్వేల్): కారు బోల్తా పడిన సంఘటనలో ఒకరు మృతి చెందగా, మరో నలుగురికి గాయాలయ్యాయి. ఆదివారం ములుగు ఎస్‌ఐ రంగకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మేడ్చల్ జిల్లా మల్లంపేట ప్రగతి హోమ్స్‌లో నివాసముంటున్న మొహిజొద్దీన్ జై మీడియాలో ఎల్‌ఈడీ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం కరీంనగర్‌లో జరిగిన ఈవెంట్‌కు వెళ్లాడు. శనివారం కరీంనగర్ నుంచి తిరిగి వస్తుండగా వంటిమామిడి వద్ద కారు అదుపుతప్పి బోల్తాపడటంతో మొహిజొద్దీన్ తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. అదే కారులో ప్రయాణిస్తున్న మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. డ్రైవర్ శ్రీధర్ అతివేగం, అజాగ్రత్త కారణంగానే ప్రమాదం జరిగిందని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆటోలు ఢీ: ఐదుగురికి గాయాలు



రోడ్డు ప్రమాద దృశ్యం

రామాయంపేట(మెదక్): నార్సింగి మండలం వల్లభాపూర్ సమీప జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం చిన్నశంకరంపేట మండలం సూరారం గ్రామస్తులు ఆటోలో నార్సింగి ఆస్పత్రికి వస్తున్నారు. వీరి ఆటోను ఎదురుగా వస్తున్న మరో ఆటో ఢీకొంది. ఈప్రమాదంలో ప్రసాద్, షఫీతోపాటు మరో ముగ్గురు గాయపడ్డారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నార్సింగి పోలీసులను వివరణ కోరగా ప్రమాదం విషయంపై తమకు ఫిర్యాదు అందలేదని తెలిపారు.

యువకుడి ఆత్మహత్య



శ్రీనివాస్ (ఫైల్)

కోహీర్(జహీరాబాద్): రైలు కిందపడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన కోహీర్ పట్టణ శివారులో చోటు చేసుకొంది. స్థానికులు అందించిన సమాచారం ప్రకారం మృతుడు తలారి శ్రీనివాస్(30) కోహీర్ పట్టణంలోని భీమ్‌నగర్ కాలనీ నివాసి. పటాన్‌చెరువు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఆర్టీజన్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం తెల్లవారుజామున ఇంటి నుంచి వెళ్లిన శ్రీనివాస్ తాను జాడిగడ్డ ప్రాంతంలో ఆత్మహత్య చేసుకుంటున్నానని అన్న పరశురామ్‌కు మెసేజ్ పెట్టాడు. పరశురామ్ వెంటనే ఇరుగుపొరుగు వారితో కలిసి వెళ్లి చూడగా శ్రీనివాస్ మృతదేహం రైలు పట్టాలపై పడి ఉంది. శ్రీనివాస్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. జహీరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టమ్ అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యర్థ జలాలు తాగి జీవాల మృత్యువాత



ఆందోళన చేస్తున్న గొర్రెల కాపరులు, మద్దతుదారులు

- గొర్రెల కాపరుల ఆందోళన
- నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): పరిశ్రమ వ్యర్థ జలాలు తాగి గొర్రెలు మృత్యువాత పడటంతో నష్టపరిహారం చెల్లించాలంటూ గొర్రెల కాపరులు ఆందోళనకు దిగారు. మండల పరిధిలోని నందికంది శివారులోగల బ్లూ క్రాఫ్ట్ ఆగ్రో పరిశ్రమ వదిలిన రసాయన వ్యర్థ జలాలు తాగి దాదాపుగా 50 జీవాలు మృతి చెందాయని బాధితులు ఆదివారం సాయంత్రం పరిశ్రమ ఎదుట ఆందోళన చేశారు. గ్రామపెద్దలు, బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన గొర్రెల కాపరులు పత్తి అంజి, రాములు, మల్లయ్య, ఐల్లప్ప తదితరులు 950 జీవాలను వెల్టూర్ శివారుకు మేత మేపేందుకు తీసుకొచ్చారు. రోజు మాదిరిగానే ఆదివారం ఉదయం జీవాల మేత కోసం వెళ్లారు. ఈలోగా జీవాలకు దాహం వేయడంతో వెల్టూర్ శివారులో గల ఓ కాలువలో నీళ్లు తాగాయి. తాగిన కొద్ది సేపటికి అస్వస్థతకు గురై మృతి చెందాయి. ఇలా రెండు గంటల వ్యవధిలో 50 జీవాలు మృతి చెందాయి. దీంతో బాధితులు గొర్రెకు రూ.20 వేల చొప్పున పరిశ్రమ యాజమాన్యం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ మృతి చెందిన జీవాలతో పరిశ్రమ వద్ద ఆందోళన చేశారు. వీరికి ఉమ్మడి జిల్లా మాజీ గొర్రె కాపరుల సంఘం డైరెక్టర్ పెద్దగొల్ల నగేష్, నందికంది, గొల్లగూడెం సర్పంచ్‌లు రాజు, నవీన్ కుమార్, ఉప సర్పంచ్ సునీల్, నాయకులు శివ కుమార్, సగమేష్ యాదవ్ తదితరులు మద్దతుగా నిలిచారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ నవీన్ కుమార్ బందోబస్తు ఏర్పాటు చేశారు. పరిశ్రమ యాజమాన్యం పోలీస్ స్టేషన్ లో మాట్లాడుకుందామని తెలుపగా బాధితులు, మద్దతుదారులు పరిశ్రమ వద్దే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.